క్లుప్తంగా

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్

జన్నారం: స్వర్ణకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా జన్నారం మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల వెంకటేశ్ నియామకం అయ్యాడు. ఆదివారం మంచిర్యాలలో జరిగిన సమావేశంలో వెంకటేశ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి హనుమయ్యలు నియామకం పత్రం అందజేశారు.

ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేసుకోవాలి

భీమారం: ఇప్పటి వరకు ఆధార్‌కార్డులు ఉన్న వ్యక్తులు తమ కార్డులను భీమారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో అప్‌డేట్ చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. ఈ నెల 17 నుంచి 29వరకు అప్‌డేట్ చేయడం జరగుతుందని అన్నారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు



పోచమ్మ గుడి వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మొదట గుండాల వద్ద స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. అనంతరం చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందిస్తున్న కార్యదర్శులు

చెన్నూర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబెషనరీ కాలం ముగిసినందున వెంటనే రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయక పోవడంతో సమ్మె చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో అజ్మత్ అలీకి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె నోటీసు అందజేశారు.

18న 'ప్రజా పోరుయాత్ర' ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాండూర్: బీజేపీ హటావో దేశ్‌కీ బచావో పిలుపుతో ఈనెల 18 న బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్రను చేపట్టనున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తాండూర్ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రం ఐబీలో ప్రజాపోరు యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. దేశాన్నీ పాలిస్తున్న బీజేపీ మతోన్మాదాన్నీ రెచ్చగొడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేష్, మాదారం టౌన్‌షిప్ కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు భూమయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఉచితంగా గ్యాస్ట్రో, లివర్ ఓపీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా, ఇస్లాంపుర రోడ్డులోని కాకతీయ గ్యాస్ట్రో, లివర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఉచితంగా ఓపీ పరీక్షలను చూడడంతో పాటు, ప్రతి నెల బుధవారం రూ.10వేల విలువ గల లివర్ టీపీ పరీక్షను ఉచితంగా చేయనున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రావణ్ తూమాటి తెలిపారు. ఫ్యాటీ లివర్, ఆల్కహాల్ లివర్ డిసీజెస్, షుగర్, హైకొలెస్ట్రాల్, హైపర్టైటిస్, ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న వారికి ప్రతి నెల మూడవ బుధవారం ఉచితంగా లివర్ ఫైబ్రో స్కాన్ చేస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



పంట చేనువద్ద నిరంతరం శబ్దం చేసే బ్లూటూత్ మైకులు



కాపలా కోసం చేను వద్ద మంచె



పంట చేను మధ్యలో గుడారం వేసుకుని పంటకు కాపలా..



పంట రక్షణకు చేను చుట్టూ సోలార్ కంచె..

పంట పండేలా.. కర్షకుడి కాపలా

- పంట రక్షణకు బెదుర్లు, శబ్దం చేసే మైకులు..
- మంచెలు, గుడారాలు వేసుకుని పడిగాపులు..

దండేపల్లి: పంటల రక్షణకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుత యాసంగిలో నీటి కొరత దృష్యా చాలా మంది రైతులు వరికి బదులు, మొక్కజొన్న పంట సాగు చేశారు. మొక్కజొన్న పంటను, చిలుకలు, కోతులు, అడవి పందుల బెడదనుంచి కాపాడుకునేందుకు రైతులకు కంటిమీదు కునుకు ఉండటం లేదు. చాలా మంది రైతులు, రాత్రి పగలు పంట చేనువద్దే కాపలా ఉండి కాపాడుకుంటున్నారు. పంట రక్షణకు రైతులు పంట చేను మధ్యలో గుడారాలు వేసుకుని అక్కడే ఉంటున్నారు. మరికొందరు మంచెపై ఉంటు పంటకు కాపలా కాస్తున్నారు. ఇంకా కొందరూ రైతులు సోలార్ కంచెలు ఏర్పాటు చేస్తే, కొందరేమో, పంట చేను వద్ద ఎప్పుడు అలికిడి ఉండేలా, బ్లూటూత్ మైకులు ఏర్పాటు చేశారు.దండేపల్లి మండలం లోని పలు గ్రామాల్లో రైతులు పంటలకు ఇలా కాపలా ఉంటూ కనిపించారు.

మహిళల సంరక్షణకు పొదుపు



సబ్ పోస్టాఫీస్‌లో మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ ఖాతాను అందిస్తున్న సబ్‌పోస్ట్ మాస్టర్ (ఫైల్)

- తపాలాశాఖలో సరికొత్త పథకం
- 'మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్'
- తక్కువ సమయంలో ఎక్కువ వడ్డీ

దండేపల్లి: భారత ప్రభుత్వం 2023లో తపాలా శాఖలో ప్రవేశపెట్టిన చిన్న మొత్తాల పొదుపు పథకం 'మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' ఇది కేవలం మహిళలు, బాలికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకం. ఇది తక్కువ సమయంలో ఎక్కువ వడ్డీ రాయితీ పొందేలా తయారు చేశారు. మహిళ సమ్మాన్ సేవింగ్ ఖాతాను, ఒక మహిళ తన కోసం కానీ, లేదా మైనర్ బాలిక తరపున, సంరక్షుడు తెరవచ్చు. రూ.1000 నుంచి, రూ.2లక్షల వరకు డిపాజిట్‌కు అనుమతి ఉంది. డిపాజిట్లపై 75శాతం వడ్డీ అందిస్తుంది. అదేలా అంటే ఈ పథకం కింద చేసే డిపాజిట్లకు ఏడాదికి 75శాతం అంటే త్రైమాసికానికి కలిపి ఖాతాలో జమచేస్తారు.

ఉపసంహరణ, మూసివేత..

మొత్తంలో 40శాతం వరకు ఉపసంహరణ ఒక సంవత్సరం తర్వాత మెచ్యూరిటీకి ముందు తీసుకోవచ్చు. డిపాజిటర్ మరణం కారణంగా లేదా అత్యవసర పరిస్థితిలో ఖాతాను మూసివేయవచ్చు. 2శాతం తగ్గిన వడ్డీతో అంటే 5.5 శాతంతో ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా మూసివేయవచ్చు.

పేమెంట్ ఆఫ్ మెచ్యూరిటీ ఇలా..

ఖాతా తెరిచిన తేదీ నుంచి 2సంవత్సరాలు పూర్తయిన తర్వాత పూర్తి మెచ్యూరిటీ వస్తుంది. రూ.1000 పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ మొత్తం కలుపుకుని, 75శాతం వడ్డీతో, రూ.1160, రూ.50వేలకు, 58,011, రూ.లక్షకు, రూ.1,16,022, రూ.2లక్షలకు 75శాతం వడ్డితో రూ.2,32,044 తో చెల్లిస్తారు.

మహిళలకు ఎంతో ప్రయోజనం..



కేంద్ర ప్రభుత్వం మహిళలు, బాలికల కోసం చిన్న మొత్తాల పొదుపు కోసం ప్రవేశ పెట్టిన 'మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' పథకం మహిళలకు ఎంతో ప్రయోజనం. ఇదీ కేవలం 31 మార్చి 2025 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ వడ్డీ పొందే ఈ పథకాన్ని మహిళలు, బాలికలు వినియోగించుకోవాలి. –రామారావు, పోస్టల్ ఏఎస్పీ, మంచిర్యాల

పల్లెవాకిట.. చిరుతల రామాయణం



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

- పరవశిస్తున్న పల్లె జనం
- తిలకించేందుకు పక్క ఊర్ల నుంచి..
- నేటితో ముగియనున్న ప్రదర్శన

వేమనపల్లి: మద్దెల దరువుల, తాళాల చప్పుళ్లతో కొత్తపల్లి గ్రామం పరవశిస్తోంది. శృతి తప్పని పాటలు అనుగుణమైన నృత్యాలతో హోరెత్తుతోంది. చుట్టు మిరిమిట్లు గొలిపే సభా వేదికపై ఆర్కెస్టా హంగులు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ఇసుక వేస్తే రాలనంత మంది జనం చిరుతల రామాయణం నాటకాన్ని తిలకిస్తున్నారు. మరుగునపడ్డ జానపద కళను పల్లె ఒడిలో చిరుతలరామాయణ సవ్వడి గత ఆరు నెలలుగా నిర్విరామంగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం వరకు చిరుతల రామాయణం నాటక ప్రదర్శన కొనసాగుతుందని శిక్షకుడు సమ్మయ్య తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు స్థానికులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో జిల్లా నలుమూలల నుంచి వాహనాలలో తరలివస్తున్నారు.

ఖర్చుకు వెనుకాడకుండా...

చిరుతల రామాయణ నాటక ప్రదర్శన అంటేనే పెద్ద ఖర్చుతో కూడుకున్నది. గతంలో కొద్దిపాటి ఖర్చులతో చిరుతల రామాయణం ప్రదర్శించేవారు. ఇప్పుడు మూడు నెలల శిక్షణ, శిక్షకుడికి నెలకు రూ.30వేల చొప్పున చెల్లిస్తున్నారు. అదే విధంగా వేదిక కాస్ట్యూమ్, మేకప్ సామగ్రి పాత్రదారణ ఆభరణాలు అన్నీ ఖర్చుతో కూడుకున్నవే. మొత్తం రూ.4లక్షల వ్యయంతో గ్రామస్తులు ఈ నాటక ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. పాత్రదారులు సమష్టిగా కొంత ఖర్చు భరిస్తుండగా గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించారు. స్థానిక సర్పంచ్ రాజేశ్వరి రూ.5వేలు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణుమాదవ్ రూ.10వేలు, నీల్వాయి ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచ్ గాలి మధు రూ.5వేలు తమ వంతు సహకారంగా అందజేశారు. సుమారు 46మంది పాత్రదారుల సహకారంతో రామాయణ ప్రదర్శన శోభాయమానంగా కొనసాగుతుంది.

కళను బతికిద్దాం



మారుతున్న సమాజంలో పురాతణ చిరుతల రామాయణ, యక్షగానం ప్రదర్శనలు కనుమరుగవుతున్నాయి. వీటిని పల్లెల్లో ఇప్పుడు కూడా ప్రదర్శించుకొని కాపాడుకోవాలి. ప్రజల్లో మంచి నడవడికలు వస్తాయి. చెడు వ్యసనాలు తొలిగిపోతాయి.

– సమ్మయ్య, శిక్షకుడు

పాటంటే ప్రాణం



నాకు చిరుతల యక్షగానం పాటలంటే చిన్నప్పటి నుంచి చాలా ఇష్టం. ఇప్పటికి నాలుగుసార్లు హన్మంతుడి పాత్ర ధరించాను. ఊళ్లో చిరుతల రామాయణం ప్రదర్శన వల్ల ఊరంతా రామ నామం మారుమ్రోగుతుంది.

– బొరుకుటి మధునయ్య

పండుగ వాతావరణం



చిరుతల రామాయణంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పొద్దు పోయిందంటే చిన్నా పెద్ద తేడా లేకుండా రామాయణ నాటక ప్రదర్శన వద్దకు తరలివస్తున్నారు. ఈ ప్రదర్శనతో ఊళ్లో ఒకరిపై ఒకరికి సన్నిహిత్యం పెరిగిపోతుంది. ఎలాంటి విబేధాలు గొడవలకు తావు లేకుండా ఉంటున్నాం.

– సిడాం శ్రీనివాస్

మైనార్టీల సంక్షేమానికి కృషి



కానుకలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ

కోటపల్లి: మైనార్టీల సంక్షేమానికి వివిధ పథకాలను బీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తోందని వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లిం కుటుంబాలకు అందించే కానుకలను ఆదివారం సర్వాయిపేటలో వైస్ ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత కుమారి, జడ్పీకోఆప్షన్ అజ్గర్, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, నాయకులు గుర్రం రాజన్న, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కేసీఆర్ తోఫా పంపిణీ :

తాండూర్: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ తోఫాను పంపిణీ చేశారు. ఇందులో ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి గౌస్, నాయకులు జావీద్ హుస్సేన్, ఎండి ఆసిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

వైకుంఠ వాహనం ప్రారంభం



ప్రారంభిస్తున్న కంపెనీ ఓనర్లు, ప్రజాప్రతినిధులు

చెన్నూర్‌రూరల్: అంజనీ పుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఓనర్లు గుర్రాల శ్రీధర్, రవి సహకారంతో మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఆదివారం వైకుంఠ వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రత్న సమ్మిరెడ్డి, స్థానిక సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, ఉప సర్పంచ్ కుంభం ముకుందరెడ్డి, ఎంపీటీసీ నగావత్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన మండల కమిటీ



కొండపూర్‌లో సమావేశమైన గౌడ సంఘ సభ్యులు

కాసిపేట: మండలంలోని కొండపూర్‌లో ఆదివారం గౌడ కులస్తులు సమావేశమై తమ సమస్యలపై చర్చించి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మార్క శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పోడేటి రాజగౌడ్, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌గౌడ్, పడాల మల్లేష్, జాయింట్ సెక్రెటరీగా తాటిపాముల రాజబాబుగౌడ్, కోశాధికారిగా శేఖర్‌గౌడ్, సలహాదారులుగా తాటిపాముల శంకర్‌గౌడ్, నేరెల్లి బుగ్గయ్య, పల్లె మల్లయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ నెల 23న గౌడ సంఘ ఆత్మీయ సమ్మేళనం, గ్రామ కమిటీలు, యూత్ కమిటీ ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

19న మహ్మద్‌గౌస్ స్తూపం ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్బని కృష్ణ

కాసిపేట: బహుజన బంధువు, పీడిత వర్గాల ఆశాజ్యోతి ఎంసీపీఐ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మహ్మద్ గౌస్ స్థూపావిష్కరణ, ద్వితీయ వర్ధంతిని జయప్రదం చేయాలని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ కోరారు. ఆదివారం సోమగూడెంలో వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల19న వరంగల్ జిల్లాలోని కొత్తూర్‌లో 51ఫీట్ల స్థూపావిష్కరణ, రెండవ వర్ధంతి బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిమాపక అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో వారోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ప్రమాదాల బారిన పడిన వారికి ప్రథమ చికిత్స ఏ విధంగా అందజేయాలో వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సర్వమతాలకు సమప్రాధాన్యత



మహిళకు కానుక అందిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వ మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లిలోని సింగరేణి కళావేదికలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలకు దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చిన్నయ్య ముస్లింలకు పండ్లు తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, తాండూర్ జెడ్పీటీసీ బానయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొద్దు నారాయణ, మున్సిపల్ కౌన్సెలర్లు గెల్లి రాజలింగు, అశోక్, కృష్ణ, రాములు నాయక్ పాల్గొన్నారు.

దానం చేయడం తృప్తినిస్తుంది

బెల్లంపల్లి: పేదలకు దాన ధర్మాలు చేయడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆదివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 4వ వార్డు గోల్ బంగ్లాబస్తీలో గౌస్ ఏ ఆజమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు దుస్తువులు, సేమియా ఇతర వస్తు సామగ్రిని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన కొంతకాలం నుండి ఏటా క్రమం తప్పకుండా రంజాన్ పండుగ వేళ తోచిన రీతిలో గౌస్ఏ ఆజమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ధానాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, వార్డు కౌన్సెలర్ షేక్ అస్మా యూసుఫ్, సొసైటీ అధ్యక్షుడు షేక్ ముక్తార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వాజిద్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ సత్యనారాయణ ఉన్నారు.

దళిత రత్న పురస్కారం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు గోళ్ల రాజమల్లు దళిత రత్న పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈనెల 14న రవీంద్ర భారతిలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పురస్కారాన్ని అందజేశారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్యశిబిరం

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేటలో హైదరాబాద్ నెక్ట్‌జెన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీసీఎమ్మెఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య ప్రారంభించారు. శిబిరంలో సుమారు వంద మందికి పైగా ఉచితంగా ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులతో పాటు అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అంది ంచారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డై రెక్టర్ సురేందర్, స్థానిక లక్ష్మీ ప్రథమ చి కి త్స కేంద్రం నిర్వాహకుడు సతీష్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

దండేపల్లి: దండేపల్లి కేజీబీవీ విద్యార్థి రాథోడ్ కల్యాణి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్ (టీటీడబ్ల్యూ సీవోఈ) వరంగల్‌లో సీటు సాధించినట్లు కేజీబీవీ ఎస్వో మంజుల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో ఆమె ప్రతిభ కనబరచడంతో బైపీసీ గ్రూపులో సీటు లభించిందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముత్తె శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కావడంతో ఆసుపత్రి ఖర్చులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కారుకూరి ట్రస్టు చైర్మన్, న్యాయవాది కార్కూరి సురేందర్ తన ట్రస్టు ద్వారా రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో సభ్యులు సునీల్, సురేందర్, కమలాకర్, కిషన్, పాల్గొన్నారు.

శ్రీరామదూత సేవాసమితి ఆధ్వర్యంలో రోడ్డు ఏర్పాటు

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామపంచాయతీ మారుమూల గ్రామం పాత తిరుమలపూర్‌లో ఆదివారం శ్రీరామదూత సేవాసమితి ఆధ్వర్యంలో మొరం రోడ్డు పోశారు. వర్షాకాలంలో ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులపు దృష్టిలో పెట్టుకుని మొరం పోసినట్లు తెలిపారు. సేవాసమితి వారిని సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు.

జాగృతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

మంచిర్యాలటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భారత జాగృతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం 125 మంది కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పూస్కూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూస్కూరి రామ్మోహన్‌రావు హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలను సాధించేలా పాలన చేపడుతుందన్నారు. కార్యక్రమంలో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు, సాహిత్యం విభాగం జిల్లా అధ్యక్షుడు దుర్గం రాజేశం గౌడ్, తోకల సురేశ్ యాదవ్, సింగతి మురళి, తిరుపతి రెడ్డి, తిరుమల, కుమార్, వెంకట్, బాలు, సమ్మయ్య, సాయి, సంపత్, శ్రీనివాస్, అబ్రహం పాల్గొన్నారు.